క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



మరికల్: మండల కేంద్రానికి చెందిన నవనీతకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కావడంతో శనివారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి బాధితులకు అందజేశారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితురాలికి రూ. 45,500 చెక్కు రావడంతో భర్త నర్సింహులుకు ఎమ్మెల్యే నుంచి చెక్కును తీసుకున్నాడు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరన్న, గోపాల్, తిరుపతయ్య, మల్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంటి పరీక్షలు

నారాయణపేట రూరల్: మండలంలోని పేరపళ్లలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు.. డాక్టర్ శ్రీనివాసులు హాజరై విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, అద్దాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కంటి ప్రాముఖ్యత, చూపు మందగించకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దూసాసీతారాములు, టీచర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీసును సద్వినియోగం చేసుకోండి

నారాయణపేటరూరల్/మద్దూరు: తెలంగాణ ఆర్టీసీ ప్రజా రవాణా తో పాటు గూడ్స్ ఎగుమతికి ఏర్పాటు చేసిన లాజిస్టిక్ సర్వీస్ ను సద్వినియోగం చేసుకోవాలని ఏటీఎం ఇసాక్ బిన్ మహమ్మద్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని బస్‌స్టేషన్ ఆవరణలో లాజిస్టిక్ సేవల కోసం సంప్రదించాల్సిన నంబర్ 9642061688 ఇక్కడి నుంచి తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఈ సేవలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు సరుకు రవాణ కోసం దీన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆకస్మికంగా ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కృష్ణా: మండలంలోని హిందుపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఎంఈఓ నిజాముద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో బోధనకు సంబంధించిన ప్రణాళిక, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, విద్య ప్రమాణాలు తదితర అంశాలపై వారితో చర్చించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు.. పాఠశాలకు సంబంధించిన అంశాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అజయ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జ్యోతి, ఉమేష్, ప్రశాంతి, హ నుమదాస్, వెంకటేష్, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మరికల్: స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి కృష్ణ ప్రారంభించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వైద్యులు మండలంలోని కార్మికులకు వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారు. అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఈ మేరకు.. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ కొండన్న మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వారి ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని పనిచేసే కార్మికుల ఆరోగ్యం మనకు ఎంతో ముఖ్యమన్నారు. ఎంపీఓ పావని, కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, అరవింద్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

మాగనూర్: వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా పీహెచ్‌సీలోని వైద్యసిబ్బందికి మండల ఇన్‌చార్జి వైద్యాధికారి వినోద్‌గౌడ్ ఆధ్వర్యంలో హెల్త్‌చెకప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యం కోసం నిత్యం కష్టపడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి అంటే ముందు వైద్యసిబ్బంది కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్ వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ధన్వాడ: వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా శనివారం మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ అధికారి మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్సులు, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే

మాగనూర్: తెలంగాణ ప్రభుత్వం ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేలో భాగంగా శనివారం మండలంలోని అడవిసత్యారం ప్రాథమిక పాఠశాలలో సర్వేను నిర్వహించినట్లు తనిఖీ అధికారి సునిల్ తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్‌ఎల్‌ఎన్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుపై ప్రత్యేక శ్రద్ధ చూయించి వారి చదువును మెరుగుపర్చేందుకు కృషిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకోసం కరాటే నేర్చుకోండి

నారాయణపేట: విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకోవడంతో ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని ద్వారక సెంట్రల్ స్కూల్‌లోని డ్రాగన్ షాటోకాన్ కరాటేక్లాస్‌కు ఆమె సందర్శించి తిలకించారు. ఈ మేరకు.. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాల నుంచి రక్షించుకునేందుకు కరాటే దోహదపడుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు మూడు నెలలపాటు కరాటే శిక్షణను అతి త్వరగా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం, కరాటే శిక్షకులు ఉమర్, మహ్మద్ సలీం, ధర్మేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, వైద్య సిబ్బందికి ఏఎన్‌ఎంలకు రక్త పరీక్షల నమూనాలను సేకరించి పరీక్షలు చేశారు. అలాగే వృద్ధులకు గుండె పరీక్షలు చేసి గుండెకు సంబంధించినటువంటి లిపిడ్ ప్రొఫైల్ అనే పరీక్ష కోసం రక్త నమూనాను సేకరించి బీపీ షుగర్ ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, వైద్యులు నరసింహారావు సగరి, ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్స్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్

రేబిస్‌పై విద్యార్థులకు అవగాహన

నారాయణపేట: ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాధిపై జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.. పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి అనిరుద్, ఆచార్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి

సీసీ కెమెరాలతో మరింత రక్షణ



బైరంకొండలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో భద్రత మరింత పెరుగుతుందని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బైరం కొండలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, దొంగతనాలను, అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవడంలో ఎంతో దోహదపడతాయన్నారు. ట్రెయినీ ఎస్‌ఐ గాయత్రి, సాయిబన్న, రామకృష్ణ, గ్రామ పెద్దలు వాదిరాజ్, సిద్దాం రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

మక్తల్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ట్రెయినీ ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడారు.. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ 1930 నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు. లాల్‌సింగ్, నరేష్, మనోహర్‌రెడ్డి, అశోక్, శ్రీకాంత్, చంద్రశేఖర్, భాను, రాజేందర్ పాల్గొన్నారు.

కృష్ణా: సైబర్ నేరాలపై విద్యార్థులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎండీ నవీద్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాగనూర్: అపరిచిత వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ మన్నన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల, మత్తు పదార్థాలపై అవగాహన నిర్వాహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ సాయికూమార్, నర్సింహులు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నారాయణపేట రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యపడుతుందని డీఐఈఓ సుదర్శన్ రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సదస్సుల ద్వారా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు వెంకట్రాములు, రషీద్, రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మరికల్: యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు రాజేష్ అన్నారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆయన యోగా తరగతులను ప్రారంభించారు. ప్రతి రోజు యోగా నిపుణులతో ఆసనాలు వేయించడం జరుగుతుందని, గ్రామస్తులు నిత్యం ఉదయం సమయంలో నిర్వహించే యోగాకు రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

సమయ పాలన పాటించాలి

మాగనూర్: మండలంలో ఆయా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకోవాలని ఎంఈఓ మురళీధర్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన సమయంలో పాల్గొని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆయన తరగతి గదులలో విద్యార్థులతో ముచ్చటించారు. హెచ్‌ఎం నర్సింహారెడ్డి, సీఆర్పీ ఎల్లాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలి

నారాయణపేట రూరల్: తెలంగాణ ప్రభుత్వం రూ. రెండు లక్షలపైన ఉన్న రైతులందరికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్.నర్సింహ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కూడా వీరికి రూ. లక్ష రుణమాఫీ కేసీఆర్ ప్రభుత్వం చేయలేదని తెలిపారు. సీఎం రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రైతుల అకౌంట్‌లో రెండు లక్షల రుణమాఫీ డబ్బులు జమచేయాలని కోరారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

మద్దూరు: అంగన్‌వాడీలో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి అంగన్‌వాడీలకు ఆదేశించారు. శనివారం మండలంలోని ఖాజీపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీఓ రామన్నతో కలిసి పరిశీలించారు. చిన్నారులకు, మహిళకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. చిన్నారులు, గర్భిణి, బాలింతలు అంగన్‌వాడీలో అందజేసే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

ఘనంగా హిందీ దివాస్

మద్దూరు: మండలంలోని పల్లెర్ల ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే మీరాబాయి, తులసీదాస్, శ్రీకృష్ణ, మహాత్మగాంధీ వేషధారణలచే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు.. పాఠశాల హెచ్‌ఎం బాలయ్య మాట్లాడుతూ.. దేశంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషా హిందీ అని హిందీని నేర్చుకోవడంతో దేశంలో ఎక్కడైన స్థిరపడడానికి అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. అనంతరం హిందీ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హన్మంతు, వీరేంద్రగౌడ్, శ్రీకాంత్, అనిల్, నరేష్, దేవేందర్‌గౌడ్, బస్వరాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలి



మక్తల్‌లో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కోటకొండలో



ఊట్కూర్‌లో..

సాక్షి, నెట్ వర్క్: నారాయణపేట మండలంలోని కోటకొండలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన విగ్రహానికి పీవైఎల్ ఉపాధ్యక్షుడు సలీం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశభక్తికి నిలువెత్తు రూపం, పోరాట స్ఫూర్తికి ప్రతిరూపం .. త్యాగానికి అసలైన నిర్వచనం భగత్ సింగ్ అన్నారు. అలాగే పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, రక్త దాన శిబిరాన్ని ఎస్ఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో యాదగిరి, హన్మంతు, నయీమ్, అబ్దుల్ రహమాన్, కేశవులు, ట్రెయినీ ఎస్ఐ గాయత్రి, సీఐటీయూ నాయకులు వెంకటరామిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శివకుమార్, బాలరాజు, బలరాం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

■ భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలని మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం బీఏస్ఎఫ్ ఆధ్వర్యంలో నర్వ మండలం యాంకిలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్, రైచూర్ శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాము, ప్రతాప్, జయప్రకాష్, అంజన్న, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

■ భగత్ సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేద్దామని పలువురు నాయకులు అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలోని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పృధ్వీరాజ్, నారాయణ, నారాయణ, అజయ్, రమేష్, శేఖర్, అక్షయ్, భాస్కర్ పాల్గొన్నారు.

■ మాగనూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతిని ఎస్ఎఫ్ఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆనంతరం వారు మాట్లాడారు.. నాయకులు నయూమ్, అఖిల్, భాను, హుస్సేన్, సూర్యప్రకాష్, నవాబ్, అంబ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

■ యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కోరారు. ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్లలో శనివారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారు మాట్లాడారు.. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, అంజప్ప, లింగప్ప, బాలప్ప, తిరుమలేష్, నర్సింహులు పాల్గొన్నారు.

■ మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడారు.. భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి యువత పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు గౌస్, కాశీ, భీమేష్, మహేందర్, కార్తీక్, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

■ ధన్వాడలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. స్థానిక బస్‌స్టాండ్ వద్ద గ్రామస్తులు ఆయన చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మరికల్‌లో ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న తహసీల్దార్, సీఐలు

మరికల్: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని తహసీల్దార్ జమీల్ అహ్మద్, సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. అండర్ 14, అండర్ 17బాల, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు.. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా ఖాళీ సమయంలో క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి కృష్ణ, ఎంపీడీఓ కొండన్న, ఎంపీఓ పావని, జీహెచ్‌ఎం నాగరత్నమ్మ, ఎస్ఐ మురళి, రాంరెడ్డి, కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్, రాజేష్, బాల్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ బాలాజీ అన్నారు. పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో శనివారం మండలస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ అండర్ – 14 క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు.. గెలుపు, ఓటమిలను సమాంతరంగా తీసుకుకోవాలని కోరారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వేణుగోపాల్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిలా సెక్రెటరీ నర్సింహులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ రమణ, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మద్దూరు: నిడ్జింత ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మండలస్థాయి క్రీడా పోటీలను అధికారులు ప్రారంభించారు. 14 నుంచి 17 ఏళ్ల లోపు విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఇందులో కబడ్డీ విభాగంలో జూనియర్ బాలురలో నిడ్జింత ఉన్నత పాఠశాల మొదటి బహుమతి, యూపీఎస్ కొత్తపల్లి ద్వితీయ బహుమతి, బాలికల విభాగంలో విజేతగా నిడ్జింత, రన్నరప్‌గా యూపీఎస్ కొత్తపల్లి, సీనియర్ బాలుర విభాగంలో విజేతగా జెడ్పీహెచ్‌ఎస్ నిడ్జింత, రన్నరప్‌గా జెడ్పీహెచ్‌ఎస్ భూనీడ్, వాలీబాల్‌లో సీనియర్ బాలుర విభాగంలో విజేతగా జెడ్పీహెచ్‌ఎస్ నిడ్జింత, రన్నరప్‌గా జెడ్పీహెచ్‌ఎస్ భూనీడ్, ఖోఖోలో జూనియర్ బాలుర విభాగంలో విజేతగా జెడ్పీహెచ్‌ఎస్ నిడ్జింత, రన్నరప్‌గా జెడ్పీహెచ్‌ఎస్ భూనీడ్ విద్యార్థులు నిలిచారు. వీరికి జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొన్నున్నట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా విడుదల

మద్దూరు: మండల పరిషత్ కార్యాయంలో సవరించిన తుది ఓటరు జాబితాను ఎంపీడీఓ నర్సింహారెడ్డి శనివారం విడుదల చేశారు. ఉమ్మడి మండలంలోని 49 గ్రామ పంచాయతీలో 420వార్డులో ఉన్న ఓటర్లను గ్రామాల వారిగా ఆయన పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఉమ్మడి మండలంలో పురుషులు 27,986, మహిళలు 29,121, ఇతరులు 1, మొత్తం 57,108 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

ధన్వాడ: మండల పరిషత్ కార్యాయంలో సవరించిన తుది ఓటరు లిస్టును శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ సాయిప్రకాష్ తెలిపారు. 20 గ్రామ పంచాయతీలో వార్డులో ఉన్న ఓటర్లను గ్రామాల వారిగా ప్రదర్శించినట్లు ఆయన తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి

నర్వ: బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను తెలియజేసి వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. వీటి నిర్మూలనకోసం టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. ఏమైనా ఆపద వచ్చిన వెంటనే డయల్ 100 కు కాల్‌చేయాలన్నారు. అలాగే మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకే అవగాహన కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కురుమయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ శిరీష, పోలీస్ సిబ్బంది రఘు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే సమస్యలు పరిష్కారం

ఊట్కూరు: పోరాటాల ద్వారానే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతున్నాయని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే. శివరాములు అన్నారు. శనివారం మండలంలోని అవుసలోనిపల్లి, పులిమామిడి, పెద్దజట్రం తదితర పాఠశాలలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు యూటీఎఫ్ సంఘం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాల పంపిణీ



పత్రాలను అందిస్తున్న పంచాయతీ సెక్రటరీ

నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్‌లో శనివారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇప్పటికే అర్హులైన మహిళలను ప్రభుత్వం ఎంపిక చేయగా, వాటికి సంబంధించిన జాబితా ఆధారంగా వ్యక్తిగత ధ్రువపత్రాలను గ్రామానికి పంపింది. ఈ మేరకు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ నేరుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

నారాయణపేట రూరల్: పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద శనివారం సాయంత్రం ఉపాధ్యాయులు ప్ల కార్డులు పట్టుకుని నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అశాస్త్రీయమైన సర్దుబాటును చేసేందుకు సిద్ధం కావడం సరికాదని, జీఓ 25 ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన పాత స్థానంలోనే కొనసాగుతున్న టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూపీఎస్సీ సంఘాల నాయకులు శివరాములు, బాలాజీ, దేవేందర్, రెడ్డప్ప, పరందాములు, వాలియా నాయక్, హైమావతి పాల్గొన్నారు.

‘బతికుండగానే చంపేశారు’



హన్మంతు చనిపోయినట్లు జారీ చేసిన సర్టిఫికెట్



వికలాంగుడు హన్మంతు

కృష్ణా: పింఛన్ ఇవ్వండి సారూ.. అని వేడుకున్న పాపానికి.. డెత్ సర్టిఫికెట్ చేతిలో పెట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో బతికుండగానే ఓ మనిషిని చంపేసిన సంఘటన మండలంలోని ఖాన్‌దొడ్డిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన అన్నపోళ్ల హన్మంతు తనకున్న ఎకరా పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే 2019లో తన పొలాన్ని ఎద్దులతో దున్నుతుండుగా ఓ ఎద్దు కాలికి పొడిచింది. దీంతో హన్మంతు కాలికి తీవ్ర గాయం కాగా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా తగ్గకపోగా మరింత పెద్దగా మారింది. దీంతో వైద్యులు తప్పనిసరి పరిస్థితుల్లో కాలును తీసివేశారు. అయితే తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని కున్సి గ్రామానికి చెందిన ఓ నాయకుడిని సంప్రదించగా.. పంచాయతీ కార్యదర్శికి రూ.10 వేలు ఇస్తే హైదరాబాద్ వెళ్లి పనిచేస్తామని చెప్పడంతో డబ్బులు ఇచ్చారు. అయితే అధికారులు ఒక్కనెల కూడా పింఛన్ ఇవ్వకుండానే డెత్ సర్టిఫికెట్ చేతిలో పెట్టారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఈ విషయమై ఆరు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని.. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మార్పు చేయాలని ఉచిత సలహా ఇస్తున్నారని వాపోయాడు. అధికారులు చేసిన పొరపాటుకు హన్మంతు బలి అవుతున్నాడు. ఈ విషయమై కలెక్టర్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.